వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు మోహన్ కృష్ణ, శ్రీహరిశ్

యశోద హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స

- గుండెకు మాదిరిగా మెదడులో స్టంట్
- తల సంబంధిత సమస్యలతో దవాఖానలో చేరిన జగిత్యాల వాసి
- ప్రస్తుతం మెరుగుపడిన ఆరోగ్య పరిస్థితి

విద్యానగర్, మే 28: హైదరాబాద్ సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు దవాఖాన న్యూరో ఫిజీషియన్ డాక్టర్ మోహన్ కృష్ణ, ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజిస్టు డాక్టర్ శ్రీహరీశ్ తెలిపారు. మంగళవారం నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఐతుపల్లి గ్రామానికి చెందిన ప్రణీత (33) నాలుగు సంవత్సరాలుగా తల నొప్పి, తలతిప్పడం, వాంతులు, కళ్లు మసకబారడం, చూపు మందగించడం వంటి సమస్యలతో బాధపడుతున్నదని తెలిపారు. స్థానికంగా ఉన్న హాస్పిటళ్లలో వైద్యం చేయించుకున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేదన్నారు. దీంతో సోమాజిగూడ యశోద హాస్పిటల్‌కు రాగా, ఆమెకు పలు రకాల పరీక్షలు నిర్వహించగా, మెదడులో నీరు చేరినట్లు గుర్తించామన్నారు. ఈ జబ్బును ఇండియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ (ఐఐహెచ్)గా నిర్ధారించామన్నారు. అయితే మందులతో కొన్ని రోజులు ప్రయత్నించినప్పటికీ మెరుగుపడలేదని, సర్జరీ అవసరం పడుతుందని నిర్ధారించామన్నారు. కొన్ని రోజులుగా సమస్య మరింత జఠిలం కావడంతో తిరిగి పరీక్ష చేయగా, అమెకు ట్రాన్స్ వర్స్ సైనస్ స్టెనోసిస్ ఉందని గుర్తించామన్నారు. గుండెకు స్టంట్ వేసే మాదిరిగా మెదడులో కూడా స్టంట్ వేయవచ్చన్నారు. ఇంటర్వెన్షన్ రేడియాలజిస్టు సూచన మేరకు చిన్నపరికరం ద్వారా స్టంట్ వేసి ప్రాభావితమైన సైనస్‌ను అమర్చామని, తద్వారా రక్త ప్రవాహం మెరుగుపడడమే కాకుండా పుర్రెలో ఒత్తిడి తగ్గిందన్నారు. ఆ పద్ధతి ద్వారా ప్రణీతకు తొడలోని నరం ద్వారా మెదడులో ఎక్కడైతే నరం పలుచబడిందో ఆ ప్రాంతంలో స్టంట్ వేసినట్లు తెలిపారు. కేవలం మూడు రోజులు మాత్రమే ఆమె హాస్పిటల్‌లో ఉందన్నారు. ఇప్పుడు ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగైందని, ఎలాంటి ఇతర సమస్యలు లేవని, సాధారణ జీవితం గడుపుతున్నట్లు తెలిపారు. ప్రణీత మాట్లాడుతూ... తలనొప్పి, తలతిప్పడం, వాంతులు, కంటి చూపు మందగించడంతో చాలా ఇబ్బంది పడ్డట్టు తెలిపారు. ప్రస్తుతం తన ఆరోగ్య పరిస్థితి బాగుందని, అన్ని పనులు చేసుకుంటున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన డీఈవో

బొమ్మనపల్లి పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలించి సూచనలిస్తున్న డీఈవో

చిగురుమామిడి, మే 28: మండలంలోని లాలయ్య పల్లె, కొండాపూర్, ఇప్పలపల్లి ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను మంగళవారం జిల్లా విద్యాధికారి సీహెచ్ జనార్దన్ రావు పరిశీలించారు. ఆయా చోట్ల తాగునీరు, విద్యుత్, బాలబాలికలకు మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు కొనసాగుతుండగా, పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలు పునర్ ప్రారంభమయ్యే నాటికి పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మండల విద్యాధికారి కొమ్మర శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని వీ పావని, ఇతర పాఠశాలల హెచ్ ఎంలు ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ముకరంపుర, మే 28: నగరంలోని 11కేవీ శివ నగర్ ఫీడర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఇతర నిర్వహణ, మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు రాంనగర్, మార్కండేయనగర్, ప్రగతినగర్, సప్తగిరి కాలనీ, శివనగర్, టెలిఫోన్ క్వార్టర్ ఏరియా, బతుకమ్మ కాలనీ, హస్నాపూర్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని టౌన్-2 ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు గైనిక్, అనుభవం గల నర్సులు (GNM/B.Sc Nursing) కావలెను. స్వయంగా సంప్రదించండి: పుల్లెల హాస్పిటల్, KNR.
NTK-317429
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

పారదర్శకంగా ఓట్లు లెక్కించాలి

- ఫలితాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- వీసీ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఈవో పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు

కలెక్టరేట్, మే 28 : వచ్చే నెల నాలుగో తేదీన లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిన్న పొరపాటు కూడా జరుగకుండా ఓట్ల లెక్కింపు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా ఉండవద్దని పేర్కొన్నారు. నాలుగో తేదీన ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఈవీఎంల ఓట్లు ఒకేసారి లెక్కించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ త్వరగా చేపట్టాలన్నారు. ఫలితాల ప్రకటన కోసం మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని పేర్కొన్నారు. కౌంటింగ్ హాళ్ల వద్ద మూడంచెల పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలని, ఇతరులు ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్టమైన బందోబస్తు కల్పించాలని తెలిపారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ హాల్ బయట ఫలితాలు తెలిసేలా ఎల్ఈడీ స్క్రీన్ లను ఏర్పాటు చేయాలని, ప్రతి నియోజకవర్గం నుంచి ఐదేసి వీవీ ప్యాట్స్ నుంచి ఓటర్ స్లిప్పులను తప్పనిసరి లెక్కించాలని ఆదేశించారు. లెక్కింపు కేంద్రాల్లో సెల్ ఫోన్లు నిషేధించినట్లు స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు సైతం అనుమతి లేదని పేర్కొన్నారు. అవసరమైన కంప్యూటర్లు, ఇంటర్నెట్, విద్యుత్తు సౌకర్యం ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈవీఎంలను కౌంటింగ్ హాల్‌కు తీసుకెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని ఒకచోట భద్రపరచాలని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్ , లా అండ్ ఆర్డర్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ కే మహేశ్వర్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్, ఏసీపీలు నరేందర్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరు చూపిన ఇంజినీర్లకు బహుమతులు అందిస్తున్న ఎస్ఈ గంగాధర్

రుతుపవనాలకు ముందే తనిఖీలు

- విద్యుత్ సమీక్షలో ఎస్ఈ గంగాధర్

ముకరంపుర, మే 28: రుతుపవనాల రాకకు ముందే సబ్ స్టేషన్లు, ఫీడర్ల వారీగా తనిఖీలు చేపట్టి వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఇంజినీర్లకు సూచించారు. సర్కిల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఏఈలు, ఏడీఈలు డీఈలు, ఏవోలతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. వర్షాలకు ముందే అన్ని 33/11కేవీ ఫీడర్లను తనిఖీ చేసి అవసరమైన ఏర్పాట్లు చేసి, నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించాలని ఆదేశించారు. డీటీఆర్‌ల వైఫల్యాలను తగ్గించాలని సూచించారు. ఈ సందర్భంగా కంపెనీ స్థాయిలో ఉత్తమ పనితీరు చూపిన ఏఈ, సబ్ ఇంజినీర్లకు సీఎండీ కార్యాలయం ద్వారా పంపించిన అవార్డులను అందజేసి, అభినందించారు. సమావేశంలో డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం లక్ష్మిరెడ్డి, తిరుపతి, చంద్రమౌళి, కాళిదాసు, ఎస్ఏవో రాజేశం, ఏడీలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

'దోస్తీమీట్' విజయవంతం

ఇల్లంతకుంట, మే 28: దోస్తీమీట్ క్రీడా పోటీలు విజయవంతమైనట్లు సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్సీ అఖిల్‌మహాజన్ ఆదేశాల మేరకు గత గురువారం నుంచి సోమవారం రాత్రి వరకు మండల కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ వేడుకలకు సీఐ హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, చదువుతోపాటు క్రీడలపై యువతలో ఆసక్తి పెంచేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ క్రీడాకారులకు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వాలీబాల్‌లో వంతడుపుల, రేపాక, కబడ్డీలో రేపాక, గాలిపల్లి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా, క్రీడాకారులకు బహుమతులు అందించారు. దోస్తీమీట్ క్రీడలను విజయవంతం చేసిన క్రీడాకారులకు సీఐ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ఎస్ఐ రాజుగౌడ్, సిబ్బంది, క్రీడాకారులు ఉన్నారు.

సరిపడా విత్తనాలు లేక ఆందోళనలో రైతులు

- జిల్లాకు ఆరు వేల క్వింటాళ్లకు గానూ కేవలం 1100 క్వింటాళ్లు మాత్రమే సరఫరా
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

శంకరపట్నం, మే 28: భూసారం పెంపునకు ఉపకరించే పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వెల్మరెడ్డి రాజిరెడ్డి, నాయకుడు గుండేటి వాసుదేవ్‌తో కలిసి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీలుగ, జనుము విత్తనాల కోసం అధికారులు జిల్లాకు 6వేల క్వింటాళ్లకు ఇండెంట్ పెట్టగా, ప్రభుత్వం కేవలం 1100 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకొందని విమర్శించారు. కొందరు పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నారని, అలాంటి వ్యాపారులపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్న, సన్నకారు రైతాంగానికి ఎరువులు, పురుగు మందులు, పనిముట్లు ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. రైతుకు రెట్టింపు ఆదాయం వచ్చే సంగతి అటుంచి, రోజురోజుకూ అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఉపాధిహామీ కూలీలకు పని ముట్లు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. కూలీలకు ఎండ నుంచి రక్షణకు టెంట్ సౌకర్యం, తాగునీరు, ప్రథమ చికిత్స మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని చట్టం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. 150 మంది కూలీలను ఒక గ్రూప్‌గా విభజించడం వల్ల శ్రమకు తగ్గ కూలి గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. వేసవిలో కూలీలకు అదనంగా చెల్లించే 30 శాతం కూలి రద్దు చేయడం శోచనీయమన్నారు. త్వరలో అధికారం చేపట్టే ప్రభుత్వం గతంలో కేంద్ర బడ్జెట్‌లో కోత విధించిన రూ.25 వేల కోట్లను తిరిగి ఈజీఎస్ పథకానికి కేటాయించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదా తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అర్ధాంతరంగా నిలిచిన బీటీ రోడ్డు పనులు

- రెండో విడుత విడుదల కాని నిధులు
- కంకర పోసి చేతులు దులుపుకొన్న కాంట్రాక్టర్
- ఏడాదిగా రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు

ఎరడపల్లి నుంచి గంగిపల్లి వైపు కంకర పోసి వదిలేసిన రోడ్డు

శంకరపట్నం, మే 28: మండలంలోని ఎరడపల్లి నుంచి మానకొండూర్ మండలం గంగిపల్లి జంక్షన్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తాడికల్-ఎరడపల్లి- గంగిపల్లి-చెంజర్ల వరకు జాతీయ రహదారి-563 అనుసంధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డును నిర్మించ తలపెట్టింది. 2023లో మొదటి విడుతగా రూ.13 కోట్ల నిధులను బీటీ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేసింది. నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఎరడపల్లి నుంచి గంగిపల్లి వరకు కేవలం కంకర పోసి చేతులు దులుపుకొన్నారు. ఏడాది కాలంగా కంకర వేసిన ఈ దారిన వెళ్తున్న పలువురు ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని త్వరగా బీటీ రోడ్డు పూర్తి చేసి తమ ఇక్కట్లను తొలగించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్ అండ్‌బీ (ఎన్‌హెచ్) డీఈఈ అమీర్‌పాషాను వివరణ కోరగా, రెండో విడుత నిధుల విడుదలలో ప్రభుత్వం నుంచి జాప్యం జరుగడం వల్ల కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా నిలిపివేసినట్లు జవాబిచ్చారు. నిధులు విడుదలయ్యాక పనులు కొనసాగుతాయని తెలిపారు.

ముందుకు కదలని మురుగు

పర్యవేక్షణ లోపంతో పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేస్తున్నది. ముఖ్యంగా ఇండ్ల మధ్య మురుగు కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోతుండడంతో భరించలేని తీవ్ర దుర్వాసన వెలువడుతున్నది. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మోరె లస్మయ్య ఇంటి వద్ద గల డ్రైనేజీ నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో రాళ్లు కూలి, చెత్తా చెదారం, తదితర వ్యర్థాలతో నిండిపోయి మురుగు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, జీపీ సిబ్బందిని అడిగితే ప్రభుత్వం జీతాలు ఇవ్వకపోవడం వల్ల తాము సమ్మెలో ఉన్నట్లు చెబుతున్నారని మోరె సుదర్శన్ అనే యువకుడు తెలిపారు.

-శంకరపట్నం, మే 28

మొలంగూర్ ఎస్సీ కాలనీలో చెత్తా చెదారంతో నిండిన డ్రైనేజీ

బస్సు డ్రైవర్‌పై బైకిస్ట్ వీరంగం

- బస్సును అడ్డగించి చెప్పుతో దాడి
- అదే బస్సులో పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన ప్రయాణికులు

శంకరపట్నం, మే 28: మండలంలోని తాడికల్ వద్ద ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ వ్యక్తి విరుచుకుపడ్డాడు. బస్సును అడ్డగించి డ్రైవర్‌పై చెప్పుతో దాడి చేశాడు. బస్సులోని ప్రయాణికుల కథనం ప్రకారం.. హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుంచి హనుమకొండకు వెళ్తుండగా, తాడికల్ వద్ద బస్సు డ్రైవర్ లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదే గ్రామానికి చెందిన గాలిపెల్లి అనిల్ అనే యువకుడు, తన స్నేహితుడితో కలిసి బైక్‌పై ఎదురుగా వచ్చాడు. బస్సు వారికి సమీపంలో నుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆగ్రహానికి గురైన యువకుడు ముందుకు వెళ్లి ప్రధాన రహదారిపై బస్సును అడ్డగించాడు. నిర్లక్ష్యంగా నడుపుతున్నావంటూ బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. బస్సు డ్రైవర్ తగ్గకపోవడంతో మరింతగా రెచ్చిపోయిన అనిల్, బస్సులోకి వెళ్లి డ్రైవర్‌పై విచక్షణారహితంగా చెప్పుతో దాడికి దిగాడు. దీంతో కోపోద్రిక్తులైన కండక్టర్, ప్రయాణికులు అతడిని అదే బస్సులో కేశవపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ విజేందర్ యువకుడిపై ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

బీమా చెక్కు అందజేత

ఖాతాదారు కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందజేస్తున్న కేడీసీసీబీ మేనేజర్ గౌతమి

తిమ్మాపూర్, మే 28: మండలంలోని రామకృష్ణకాలనీలో గల కేడీసీసీ బ్యాంకు ఖాతాదారు అల్గునూర్ గ్రామానికి చెందిన శ్రీరాముల విజయ కొద్ది రోజుల క్రితం మరణించగా, పీఎంజేజేబీవై బీమా క్లెయిమ్ రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు చెక్కును మేనేజర్ గౌతమి ఖాతాదారు కుటుంబసభ్యులకు అందజేశారు. ఖాతాదారులందరూ రూ.436 చెల్లించి పీఎంజేజేబీఐ, రూ.20చెల్లించి పీఎంఎస్‌బీవై పథకంలో చేరాలని మేనేజర్ సూచించారు. ఈ నెల 31లోగా సరిపడా నగదును ఖాతాలో ఉంచితే బీమా పథకంలో చేరుస్తామని చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలుపుకోవాలి

కలెక్టరేట్, మే 28: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలుపుకోవాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పయ్యావుల జనార్దన్ డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించి, వేతన సవరణ చేస్తామంటూ ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్, గెలిచిన అనంతరం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మంగళవారం ఆ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నగరంలోని కమాన్ సమీపంలో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, తాజాగా వేతన సవరణ కోసం కమిటీ కూడా ఏర్పాటు చేసినా, పాత పీఆర్సీ బకాయిలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడం మాట తప్పడమేనన్నారు. ఇప్పటికైనా స్పందించి, పాత బకాయిలతో పాటు మూడు డీఏలు కూడా విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు రామ్మోహన్, రాజ్‌కుమార్, హర్షవర్ధన్‌రావు, చల్ల గొండ గోపాలకిషన్‌రావు, పొల్సాని మనోహర్‌రావు, కందుల ఆదిరెడ్డి, గండ్ర నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కరీంనగర్ రూరల్: గోపాల్‌పూర్‌లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సీఏలు, అంగన్‌వాడీ, పంచాయతీ కార్యదర్శి, తదితరులు

సైదాపూర్/ శంకరపట్నం/ కరీంనగర్ రూరల్, మే 28: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి పేర్కొన్నారు. మంగళవారం సైదాపూర్ మండలంలోని రాయికల్‌తండాలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఋతు పరిశుభ్రత నిర్వహణ దినోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మహిళలు నెలసరి సందర్భంగా తీసుకోవాల్సిన పరిశుభ్రత చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, అధికారులు పాల్గొన్నారు. అలాగే శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ ప్రత్యేకాధికారి ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఏఎన్ఎం స్వర్ణ మహిళలు, కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, బహిష్టు సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం గంగా జమున, అంగన్‌వాడీ టీచర్ శారద, ఫీల్డ్ అసిస్టెంట్ స్వర్ణలత, ఆశా కార్యకర్త స్వరూప, మహిళలు పాల్గొన్నారు. కరీంనగర్ మండలంలోని నగునూర్, జూబ్లీనగర్, గోపాల్‌పూర్ తదితర గ్రామాల్లో సైతం నెలసరి పరిశుభ్రతపై మహిళలు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలని కమిషనర్‌కు వినతి

హుజూరాబాద్ రూరల్, మే 28: పట్టణ సమీపంలోని కరీంనగర్ రోడ్డులో గల ఫైర్‌స్టేషన్ ఎదుట ఓ ట్రాన్స్‌కో ఉద్యోగి అక్రమ నిర్మాణం చేపట్టారని, దానిని తొలగించాలని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన దొనికన ప్రవీణ్, మహేందర్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. ఎలాంటి అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని కోరారు.

లూజ్ విత్తనాలు కొనుగోలు చేయొద్దు

చొప్పదండి, మే 28: మండలంలోని ఆర్నకొండ, కాట్నపల్లి, కొలిమికుంట, చాకుంట, చిట్యాలపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు లూజ్ విత్తనాలను కొనుగోలు చేయకూడదని, లైసెన్స్ ఉన్న డీలర్ వద్ద విత్తనాలు ఖరీదు చేసిన సమయంలో తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని తెలిపారు. విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే డీలర్లపై చర్యలు

చిగురుమామిడి, మే 28: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే విత్తన డీలర్లపై చర్యలు తప్పవని ఎస్ఐ బండి రాజేశ్, మండల వ్యవసాయ అధికారి రంజిత్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన డీలర్లకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. గడువు ముగిసిన, గుర్తింపు లేని, లూజ్ విత్తనాలు అమ్మకూడదని స్పష్టం చేశారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే కొండాపూర్‌లో ఏఈవో సాయికుమార్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

విత్తనాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

మొగ్దుంపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సత్యం, ఏఈవో స్వర్ణలత తదితరులు

కరీంనగర్ రూరల్, మే 28: విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బీ సత్యం తెలిపారు. మంగళవారం మండలంలోని మొగ్దుంపూర్, ఎలభోతారం, దుర్శేడ్ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మొగ్దుంపూర్‌లో ఏర్పాటు కార్యక్రమంలో ఏవో పాల్గొని మాట్లాడారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో దుర్శేడ్‌లో మండల పశుసంవర్ధక అధికారి డాక్టర్ రామకృష్ణ, ఏఈవో పైడితల్లి, ఎలభోతారంలో బీటీఎం శ్రీలత, ఏటీఎం రమ్య, మొగ్దుంపూర్‌లో